క్లుప్తంగా

ఏప్రిల్ 19న పుదుచ్చేరి స్థానానికి ఎన్నిక

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లు కలిసిన ఏకైక పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి సాధారణ ఎన్నికల్లో భాగంగా మొదటి ఫేజ్‌లో ఏప్రిల్ 19న ఎన్నిక జరుగుతుందని శనివారం జిల్లా ఎన్నికల అధికారి కులోత్తుంగన్ ప్రకటన విడుదల చేశారు. 20న గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుందని, నామినేషన్స్ వేయడానికి ఆఖరు తేదీ మార్చి 27, నామినేషన్ల పరిశీలన మార్చి 28న, అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు మార్చి 30 తుది గడువని తెలిపారు. ఏప్రిల్ 19న ఎన్నిక జరుగుతుందని జూన్ 4న ఓట్లలెక్కింపు ఉంటుందన్నారు. దీంతో పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గమంతా తక్షణం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులోకి వచ్చిందన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కోడ్‌ను విధిగా పాటించాలని కోరారు.

మద్యంషాపులు నిబంధనలు పాటించాలి

యానాం: లోక్‌సభకు సాధారణ ఎన్నికల నేపథ్యంలో యానాం నియోజకవర్గ పరిధిలో ఉన్న మద్యం షాపులు నిబంధనలు, సమయవేళలు పాటించాలని శనివారం డిప్యూటీ కమిషనర్ (ఎక్సైజ్) ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్ఎల్-1, ఎఫ్ఎల్-2 మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు, లిక్కర్‌ను సప్లయ్ చేసే హోటళ్లను ఆయా వ్యాపారస్తులు రాత్రి 10 గంటలకల్లా మూసివేయాలని కోరారు. అదే విధంగా లైసెన్స్ ఉన్న ప్రాంత పరిధిలోనే మద్యాన్ని విక్రయించాలని ఇతర చోట్ల అమ్మరాదని స్పష్టం చేశారు. మద్యాన్ని స్థానికులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే తీసుకెళ్లాలని ఈ నిబంధనలన్నీ ఎన్నికలు పూర్తయ్యే వరకు అమలులో ఉంటాయని ఉల్లంఘిస్తే పుదుచ్చేరి ఎక్సైజ్ యాక్ట్-1970 ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'కామిశెట్టి'


శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బండారులంక గ్రామానికి చెందిన కామిశెట్టి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయనకు శనివారం నియామక ఉత్తర్వులు అందాయి. చేనేత వర్గానికి చెందిన శ్రీనివాసరావు గతంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం బండారులంక ఉప సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కామిశెట్టి నియామకంపై ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి జాన గణేష్, ఎంపీటీసీలు అంకం హిమభారతి, గుత్తుల జానకిలక్ష్మి, పార్టీ నాయకులు కదలి రాజు, కండిబోయిన భారతి తదితరులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత


టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించిన దాత సుంకర చినబాబు

తాళ్లరేవు: స్థానిక నామన వెంకాయమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న 200 మంది విద్యార్థులకు యానాంకు చెందిన దాత సుంకర చినబాబు ఎగ్జామ్ అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని అందజేశారు. స్థానిక హైస్కూల్‌లో హెచ్ఎం జె.ఆశాలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చినబాబు విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులంతా పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ మట్టపర్తి శ్రీను, ఉపాధ్యాయులు పి.కిషోర్, వాకపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పెట్టొద్దంటూ నిరసన

యానాం: పట్టణ పరిధిలోని గోపాల్‌నగర్ పరిధిలో డంపింగ్ యార్డును పెట్టొద్దంటూ శనివారం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం ప్రకాష్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామస్తులు పుదుచ్చేరి నుంచి వచ్చిన ఎల్ఏడీ డైరెక్టర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలనకు వచ్చిన ఎల్ఏడీ డైరెక్టర్‌తో వారు వాగ్వాదానికి దిగారు. ఈ ప్రాంతంలో డంపింగ్‌యార్డు పెట్టడం వల్ల దుర్వాసనతో పాటు ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని తక్షణం ప్రభుత్వం తమ నిర్ణయాన్ని విరమించుకుని వేరే ప్రదేశానికి తరలించాలని కోరారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సమస్యపై ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరాజు, సురేష్, చిట్టిబాబు, మల్లవరపు దయ, బొక్కా బలరాం, హనుమంతరావు, మట్టపర్తి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ వైపే మళ్లీ మొగ్గు..

అమలాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పినిపే విశ్వరూప్ ప్రొఫైల్

పేరు	పినిపే విశ్వరూప్
నియోజకవర్గం	అమలాపురం
ప్రస్తుతం	ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి
పుట్టినరోజు	02-10-1962
విద్యార్హత	బీఎస్సీ బీఈడీ
సొంతూరు	నడవపల్లి, కాట్రేనికోన మండలం
భార్య	బేబీ మీనాక్షి
కుమారులు	ముగ్గురు
తల్లిదండ్రులు	రెడ్డి పంతులు, సీతమ్మ

రాజకీయ నేపథ్యం


పినిపే విశ్వరూప్

దాదాపు మూడు దశాబ్దాలుగా విశ్వరూప్ రాజకీయాల్లో ఉన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఎస్సీ నియోజకవర్గమైన ముమ్మిడివరం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున 2004 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత నియోజకవర్గాల పునర్విభజనతో అమలాపురం ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మారడంతో విశ్వరూప్ ఈ నియోజకవర్గం నుంచి 2009 ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. అప్పుడు ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. 2013 చివరిలో రాష్ట్ర మంత్రిగా పనిచేస్తున్న సమయంలో 9 నెలల ముందే రాష్ట్ర మంత్రి పదవికి రాజీనామా చేసి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీలో చేరారు. యువజన కాంగ్రెస్ నేతగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన విశ్వరూప్ తొలినాళ్లలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. తొలిసారిగా 1998లో ముమ్మిడివరం నియోజకర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. తర్వాత 1999లో కూడా అదే నియోజకవర్గం నుంచి అదే పార్టీ అభ్యర్థిగా మరోసారి పోటీ చేశారు. 2014లో అమలాపురం ఎంపీగా వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఇప్పటి వరకూ విశ్వరూప్ మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఓసారి ముమ్మిడివరం నుంచి ఓసారి, అమలాపురం నుంచి రెండుసార్లు గెలిచారు. 2019లో అమలాపురం నుంచి భారీ మెజారిటీతో గెలిచారు. – అమలాపురం టౌన్

సిట్టింగ్‌కే మళ్లీ చాన్స్

ముమ్మిడివరం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ప్రొఫైల్

పేరు	పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
నియోజకవర్గం	ముమ్మిడివరం
తల్లిదండ్రులు	సత్యారావు(లేటు), రామానుజమ్మ
చదువు	బీకాం
భార్య	నీరజ
కుమారులు	సత్య సుమంత్, హేమంత్

రాజకీయ నేపథ్యం

2009లో ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తిరిగి 2019లో వైఎస్సార్ సీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం టీటీడీ బోర్డు మెంబర్‌గా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.


పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఇతర వివరాలు

2009 రాజకీయాల్లోకి రాక ముందు సతీష్ స్టీల్స్, సతీష్ మార్బుల్స్ పేరుతో వ్యాపార రంగంలో ఉండేవారు. 1992 నుంచి 95 వరకు అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. పదేళ్ల పాటు అమలాపురం రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా కొనసాగారు. ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకుండానే 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రోత్సాహంతో రాజకీయ అరంగ్రేటం చేశారు. 2019లో గెలవడంతో మరోసారి సిట్టింగ్ చాన్స్ దక్కింది. – ముమ్మిడివరం

సీఎం నమ్మకాన్ని వమ్ము చేయను

- అమలాపురం నుంచి మూడో సారి ఎమ్మెల్యేనవుతా
- వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మంత్రి విశ్వరూప్ స్పష్టీకరణ

అమలాపురం టౌన్: అమలాపురం నియోజకవర్గ పార్టీ అభ్యర్థిగా మరోసారి తనను ప్రకటించిన సీఎం జగన్ ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గం నుంచి మూడోసారి ఎమ్మెల్యేనవుతానని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం అమలాపురం పార్టీ అభ్యర్థిగా విశ్వరూప్‌ను ప్రకటించగానే స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను పార్టీ శ్రేణులు, అభిమానులు అభినందనలతో ముంచెత్తారు. కేకులు కట్ చేసి సంబరాలు చేశారు. విశ్వరూప్ తన ఆనందాన్ని, అభిప్రాయాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. అమలాపురం ఎమ్మెల్యేగా ఇప్పటికే రెండు పర్యాయాలు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశాను. ఇదే స్థానం నుంచి మూడోసారి విజయం సాధించి మరింత అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు అప్పుడు, ఇప్పుడు, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని విశ్వరూప్ చెప్పారు. తనకు మరోసారి టికెట్ ఇచ్చిన సీఎం జగన్, ఉభయ గోదావరి జిల్లాల పార్టీ కోఆర్డినేటర్, ఎంపీ పి.మిథున్ రెడ్డికి విశ్వరూప్ కృతజ్ఞతలు తెలిపారు. నా నియోజకవర్గ ప్రజల రుణాన్ని తీర్చుకునేందుకు మళ్లీ పోటీ చేసే అవకాశం వచ్చేలా చేసిన నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజా సేవలో కొనసాగే అవకాశం ఇస్తూ పోటీలో ఉన్న నన్ను, నా కుటుంబాన్ని ప్రజలు ఆశీర్వదించాలని విశ్వరూప్ విజ్ఞప్తి చేశారు.


భట్నవిల్లిలో మంత్రి విశ్వరూప్ కలసిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు: మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: తనపై ఉన్న నమ్మకంతో సీఎం జగన్ వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజవర్గ అభ్యర్థిగా ప్రకటించారని మంత్రి విశ్వరూప్ అన్నారు. గెలిచి తన గెలుపును జగన్‌కు బహుమతిగా అందిస్తామని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయ నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ప్రకటించిన వెంటనే భట్నవిల్లిలో మంత్రి క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులు శనివారం సంబరాలు నిర్వహించారు. మంత్రి విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ తనకు టికెట్ కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజల బలంతో గెలిచి సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, యిళ్ల శేషారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రారాజు నానిరాజు, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్, పట్టణ, అల్లవరం అధ్యక్షులు సంసాని నాని, కొనుకు బాపూజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లబోయిన శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు మంత్రిని కలసి అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

ముమ్మిడివరం: ముమ్మిడివరం నియోజవర్గంలో వైఎస్సార్ సీపీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధిష్టానం నియమించింది. ముమ్మిడివరం మండల మహిళల విభాగం అధ్యక్షురాలిగా కాశి ఝాన్సీరాణి, బీసీ సెల్‌కు బొంతు సత్యశ్రీనివాస్, ఎస్సీ సెల్‌కు కాట్రు అప్పారావు, రైతు విభాగానికి జంగా రెడ్డి రమేష్, మైనార్టీ సెల్‌కు బడుగు తాతాజీ, లీగల్‌కు కుచ్చర్లపాటి రామకృష్ణంరాజు, సేవాదళ్‌కు పెసింగి నూకరాజు, పబ్లిసిటీ వింగ్‌కు కె.శ్రీనివాస్, వాణిజ్య విభాగానికి పాము చిట్టిబాబు, పంచాయతీ రాజ్ వింగ్‌కు నల్లా రెడ్డినాయుడు, వీవర్స్ వింగ్‌కు దెందుల వెంకటరమణ, విద్యార్థి విభాగానికి మోరం రవిప్రసాద్, ఎస్టీ సెల్‌కు మాసగిరి రామకృష్ణ, టీయూసీ అధ్యక్షుడిగా మోర్త వెంకట నారాయణలు నియమితులయ్యారు.

ముమ్మిడివరం అర్బన్‌లో..

మహిళా విభాగం అధ్యక్షురాలిగా చెల్లి భాగ్యలక్ష్మి, రైతు విభాగానికి తాడి అచ్యుతరామయ్య, బీసీ సెల్‌కు వస్త్రాల వీరన్న, ఎస్సీ సెల్‌కు దేవరపల్లి ఏడుకొండలు, ఎస్టీ సెల్‌కు అబ్బాదాసుల శ్రీను, మైనార్టీ సెల్‌కు షేక్ ఇస్మాయిల్, విద్యార్థి విభాగానికి జి.ఆకాష్, వీవర్ వింగ్‌కు చింతకింద వేణుగోపాలకృష్ణ, టీయూసీగా సీహెచ్ శ్రీనివాసరావు, సేవాదళ్‌గా జంగా చిరంజీవి, పబ్లిసిటీ వింగ్‌కు పాము మనోహర్‌వర్మ, వాణిజ్య విభాగానికి వెత్సా బాబ్జీ, లీగల్ సెల్‌కు కోన అఖిల్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు పి.శామ్యూల్, డాక్టర్స్ విభాగానికి వి.ఫణి, ఐటీ వింగ్‌కు కె.దుర్గాగణేష్, కల్చరల్ వింగ్‌కు ఎస్.రామకృష్ణంరాజు నియమితులయ్యారు.

కాట్రేనికోన మండలంలో..

మహిళా విభాగం అధ్యక్షురాలిగా మోకా చంద్రనాగరత్నం, రైతు విభాగానికి ఆర్.మూలస్వామి, బీసీ సెల్‌కు వి.వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్‌కు ఎల్.శ్రీను బాబు, ఎస్టీ సెల్‌కు ఎ.వెంకటరమణ, మైనార్టీ సెల్‌కు జి.అభిషేక్, విద్యార్థి విభాగానికి పి.రవికుమార్, వీవర్స్ విభాగానికి ఆర్.వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్‌కు ఓలేటి సతీష్, టీయూసి విభాగానికి వి.ఈశ్వరరావు, సేవాదళ్‌కు ఏవీవీ రాజు, పబ్లిసిటీ వింగ్‌కు సీహెచ్ వెంకటేశ్వరరావు, వాణిజ్య వింగ్‌కు సూర్యనారాయణమూర్తి, లీగల్ విభాగానికి పి.మోహనరావు, డాక్టర్స్ వింగ్‌కు వి.శ్రీనివాసరావు, కల్చరల్ వింగ్‌కు ఎ.ఉమా మహేశ్వరరావు, ఐటీ వింగ్‌కు ఆకుల శ్రీధర్‌లు నియమితులయ్యారు.

ఫ్లెక్సీలను చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

అమలాపురం రూరల్: బోడసకుర్రు, పేరూరు గ్రామాల పరిధిలోని మన్నా జూబ్లీచర్చ్ ప్రాంగణంలో సంఘ కార్యక్రమాల వివరాల కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అమలాపురం యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సంఘం వారు డీఎస్పీ ఉమామహేశ్వరరావును కోరారు. ఈ విషయాన్ని మన్నా జూబ్లీ చర్చ్ పాస్టర్ అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఇటువంటి సంఘ విద్రోహ చర్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మండల పాస్టర్స్ అధ్యక్షుడు మొసలి స్పర్జన్‌రాజు, కార్యదర్శి ఆనందరావు, పాస్టర్లు డేవిడ్‌రాజు, ఆనంద్‌కుమార్, పాల్ డేవిడ్, సాలోమెన్ రాజు, నాని బాబు, జిల్లా సెక్రటరీ యోహోవా ఉన్నారు. డీఎస్పీ స్పందించి సీసీ కెమెరాలు చెక్ చేస్తున్నామని తప్పనిసరిగా నిందితులను గుర్తిస్తామని తెలిపారు.


డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మండల పాస్టర్స్ సంఘం అధ్యక్షుడు స్పర్జన్‌రాజు తదితరులు

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేశా..

తాళ్లరేవు: తీరప్రాంత గ్రామాలు అధికంగా ఉన్న ముమ్మిడివరం నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపానని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం గాడిమొగ పంచాయతీ పెదవలసలలో రూ.36 లక్షల జల్‌జీవన్ నిధులతో నిర్మించిన తాగునీటి ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.కోట్లు నిధులు వెచ్చించినట్లు తెలిపారు. సుమారు వందకు పైగా ట్యాంకులు నిర్మించి ప్రతి గ్రామంలో సురక్షిత తాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, స్థానిక సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


గాడిమొగ పంచాయతీ పెదవలసలలో తాగునీటి ట్యాంకు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్

దేవదానంరాజుకు తెలుగువర్సిటీ కీర్తి పురస్కారం



యానాం: ప్రముఖ కవి, కథకుడు, కలైమామణి దాట్ల దేవదానంరాజుకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు శనివారం విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ టి.కిషన్‌రావు నుంచి ఉత్తర్వులు అందినట్లు దేవదానంరాజు ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న మధ్యాహ్నం హైదరాబాద్‌లో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగే పురస్కార సభలో కీర్తి పురస్కారాన్ని అందజేయనున్నారని తెలిపారు. కథలు, కవితలు, చరిత్ర, విమర్శ మొదలైన సాహిత్య ప్రక్రియల్లో చేసిన సాహిత్యసేవను పరిగణనలోకి ప్రకటించిన పురస్కారం రావడం గర్వకారణంగా ఉందన్నారు. వర్సిటీ స్తపతి పుట్టిన రోజున తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం రావడం మరింత సంతోషాన్నిచ్చిందన్నారు. గతంలో దాట్లకు కలైమామణి, తెలుగురత్న, రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డు, మధుశ్రీకథాగౌరవం, పరుచూరి రాజారాం పురస్కారం, కందుర్తి ఫ్రీవర్స్‌ఫ్రంట్ పురస్కారం తదితరమైనవి అందుకున్నారు.

నూరు శాతం హామీలు అమలు చేశాం

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్
- ముమ్మిడివరం నుంచి మూడోసారి బరిలో..

ముమ్మిడివరం: ముమ్మిడివరం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీల్లో నూటికి నూట ఇరవై శాతం అమలు చేశామని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మరోసారి ప్రకటించడంపై ఆయన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.600 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు నియోజకవర్గంలో 106 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి ఇంటింటికి తాగునీటిని అందించామన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా నవరత్నాలతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా రూ.1600 కోట్లు లబ్ధిదారులకు అందించామన్నారు. అలాగే గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైన మత్స్యకారులకు ఓఎన్‌జీసీ ద్వారా రావాల్సిన నష్టపరిహారం నిధులు రూ.640 కోట్లు బాధిత లబ్ధిదారులకు అందించామన్నారు. సీఎం జగన్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం వచ్చిందని ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థి దశలో విద్యార్థి నాయకుడిగా పనిచేశారు. అనంతరం వ్యాపారవేత్తగా అమలాపురంలో స్థిరపడి పదేళ్ల పాటు రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనూహ్యంగా 2009లో అప్పటి సీఎం వైఎస్సార్ ప్రోత్సాహంతో రాజకీయ అరంగేట్రం చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 2014లో ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మరలా 2019లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. సీఎం జగన్ ప్రోత్సాహంతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, టీటీడీ బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. మంచి ముహూర్తం చూసుకుని త్వరలో ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు.


తాళ్లరేవు సంతపేట సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకుంటున్న నాయకులు, కార్యకర్తలు

పొన్నాడకు సీటు ప్రకటించడంపై పార్టీ శ్రేణుల సంబరాలు

తాళ్లరేవు: ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేరును ప్రకటించడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంతపేట సెంటర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని ఆనందం వ్యక్తం చేశారు. బాణసంచా పేల్చి సందడి చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ మాట్లాడుతూ ముమ్మిడివరం నుంచి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను తిరిగి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు బొంతు మోహన్, మోకా మధుబాబు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు పెయ్యల మంగేష్, వెంటపల్లి నూకరాజు, నాయకులు మట్టపర్తి లోవరాజు, భూసారపు పద్మారావు, దున్నా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

అమలాపురం రూరల్: కామనగరువు పంచాయతీ పరిధిలోని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, సర్పంచ్ నక్కా అరుణకుమారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. బడుగువారిపేటలో రూ.6 లక్షలతో శ్మశానవాటిక రోడ్డు, శ్మశానవాటికలో స్నానాలు చేయుటకు షవర్, వాటర్ లైన్, మెట్లకాలనీలో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు, గ్రావెల్ రోడ్డు, వీఎస్ఆర్ కాలనీలో రూ.2 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, ఎంపీటీసీ మెండు గంగాభవాని, సెక్రటరీ అడబాల రాజేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, వార్డు సభ్యులు జొన్నాడ పల్లాలమ్మ, పార్టీ నాయకుడు నక్కా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

అమలాపురం టౌన్: అమలాపురం కోర్టుల సముదాయంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో మొత్తం 164 కేసులు పరిష్కారమయ్యాయి. రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ అధ్యక్షతన లోక్‌అదాలత్ జరిగింది. ఈ అదాలత్‌లో 18 సివిల్ కేసులు, 95 క్రిమినల్ కేసులు, 19 బైక్ యాక్సిడెంట్ కేసులు, 31 బీఎస్ఎన్ఎల్ కేసులు, ఒక బ్యాంక్ కేసు పరిష్కారమయ్యాయి. మొత్తం రూ.1.88 కోట్ల విలువైన 164 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు కార్యాలయం తెలిపింది. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్లు, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొని కేసుల పరిష్కారంలో తమ వంతు సహకారాన్ని అందించారు.

ముమ్మిడివరంలో 87 కేసుల పరిష్కారం

ముమ్మిడివరం: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 87 కేసులు పరిష్కరించారు. జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రహ్మతుల్లా అధ్యక్షతన జరిగిన లోక్ అదాలత్‌లో 87 కేసులు పరిష్కరించగా వీటి నిమిత్తం రూ.44, 20,597లు అపరాధ రుసుంగా వసూలు చేసినట్లు జూనియర్ సివిల్ జడ్జి ఒక ప్రకటనలో తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్‌వీ ప్రసాదరావు, ఏజీపీ టి.శాంతిసుధ, గ్రంధి రామారావు, నడింపల్లి సత్యనారాయణరాజు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి

అల్లవరం: కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ని ప్రకటించి దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ జూన్ 4 వరకు అమల్లో ఉంటుందని ప్రకటించడంతో మండల ఎన్నికల అధికారి సునీల్‌కుమార్ ఎన్నికల కోడ్ శనివారం అమల్లోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మ గాంధీ విగ్రహాలు మినహా ఇతర దేశ, రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేశారు. అల్లవరంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేసి ఫ్లెక్సీలను తొలగించారు. తొలుత అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన కార్యదర్శులు, వీఆర్‌ఓలు, మహిళా పోలీసులతో ఎన్నికల నియమావళిపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంతకాలం సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలను ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ వరకు కోడ్ అమల్లో ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై హరీష్‌కుమార్, ఎంఈఓ ఏడుకొండలు, ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, డాక్టర్ మౌనిక, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: సార్వత్రిక ఎన్నికలపై ఎన్నికల కమిషన్ విడుదల చేసిన నియమావళిని తూచా తప్పకుండా అమలు చేయాలని మండల అధికారులు సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు సచివాలయ మహిళా పోలీసులు పాల్గొనగా వారికి తహసీల్దార్ టి.మల్లికార్జునరావు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరప్రసాద్, ఎస్సై కె.మనోహరజోషి పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి వచ్చిన నాటి నుంచి ముగిసే వరకు పార్టీల ప్రచారంలో ఉద్యోగులు పాల్గొనరాదని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులపై ఉన్న వివిధ రాజకీయ నాయకుల కటౌట్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించాలన్నారు. అంబులెన్స్ తదితర వాహనాలపై ఉన్న రాజకీయ నాయకుల చిత్రాలను తొలగించాలన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ నాయకుల ఫొటోలు తప్ప మరే రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు ఉండకుండా తొలగించాలన్నారు. ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా ఆయా గ్రామాల్లో నెలకొల్పిన రాజకీయ నాయకుల విగ్రహాలకు పూర్తి స్థాయిలో ముసుగులు వేయాలని, అలాగే పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగులు తదితర వాటిని తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల ప్రవర్తన నియమావళి తెలుపుతూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

'కోనసీమ కథలు' పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్: కోనసీమ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా 'కోనసీమ కథలు' పుస్తకంలోని కథలు ఉన్నాయని అమలాపురం శ్రీకామాక్షి పీఠాధిపతి కామేశ మహర్షి అన్నారు. కోనసీమకు చెందిన డాక్టర్ వేదుల శ్రీరామశర్మ సంకలనం చేసిన 'కోనసీమ కథలు' పుస్తకాన్ని స్థానిక శ్రీ కామాక్షి పీఠంలో కామేశ మహర్షి ఆవిష్కరించి ప్రసంగించారు. కోనసీమ ఔన్నత్యాన్ని ప్రస్తావిస్తూ గతంలో ఆ సీమకు చెందిన 25 మంది రచయితలు రాసిన పుస్తకాలను నుంచి అమూల్యమైన రత్నాలను డాక్టర్ శ్రీరామశర్మ సంగ్రహించి సంకలనం చేయడం ద్వారా ఓ పుస్తకాన్ని తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకాన్ని సమీక్షించిన సినీ పాటల పరిశోధనాత్మక కవి డాక్టర్ పైడిపాల మాట్లాడుతూ ఈ పుస్తకంలో పలువురు రచయితలు కోనసీమ జీవన విధానాన్ని హృద్యంగా స్పృశించిన కథలను ఏరికోరి సంకలనం చేయడం మరింత మధురంగా ఉందని పేర్కొన్నారు. ఆవిష్కరణ సభలో కోనసీమ రచయితలు ముక్కామల చక్రధర్, డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ, పుత్సా కృష్ణ కామేశ్వర్, అద్దంకి అమరేశ్వరరావు, సంసోను ప్రసంగించారు. కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వేదనభట్ల సాయిలక్ష్మి, లయన్స్ ప్రతినిధులు అనిల్, వర్మ తదితరులు పాల్గొన్నారు.


కోనసీమ కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కామాక్షి పీఠాధిపతి కామేశ మహర్షి, డాక్టర్ పైడిపాల తదితరులు

ప్రాణత్యాగం చేసిన మహనీయుడు

- ఘనంగా శ్రీరాములు జయంతి
- నివాళులర్పించిన వైశ్య సంఘాలు

అమలాపురం రూరల్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి అధికారికంగా కలెక్టరేట్‌లో నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అన్నారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ మాట్లాడుతూ ఆంధ్రుల ఆశయ సాధన కోసం చేసిన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ షేక్ ఖాదర్ భాషా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టణంలో..

అమలాపురం టౌన్: ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు అజరామరమని అమలాపురం పట్టణ వైశ్య సంఘం నాయకులు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలోని శ్రీరాములు విగ్రహానికి పట్టణ వైశ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ సర్క్యులర్ బజార్ ఆవరణలోని శ్రీరాములు విగ్రహానికి నాయకుల నివాళుర్పించారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో..

స్థానిక ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు స్థానిక మున్సిపల్ సర్క్యులర్ బజార్ ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. చాంబర్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జయంతిలో చాంబర్ ప్రతినిధులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలకు కేంద్రం ఆయనకు భారతరత్న అవార్డు ఇవ్వాలని పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. విజయవాడలోని గన్నవరం విమానాశ్రయానికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని, పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించాలని సమితి కోరింది.


అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్, జేసీ నూపుర్ అజయ్

అల్లవరంలో..

అల్లవరం: రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసి అమరజీవిగా ఆంధ్రుల హృదయాల్లో పొట్టి శ్రీరాములు సుస్థిర స్థానం సంపాదించుకున్నారని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ శేషగిరిరావు శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఎంఈఓ కిరణ్‌బాబు, పరిపాలనాధికారి లక్ష్మణరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

యానాంలో..

యానాం: అమరజీవి శ్రీరాములు జయంతిని శనివారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్ఏవో మునిస్వామి, ఎస్సై జిల్లెళ్ల ప్రభాకర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.